క్లుప్తంగా

వేములదీవి వెంకన్నకు ప్రత్యేక పూజలు



నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామంలో ఉన్న వేంకటేశ్వర స్వామి వారిని శనివారం పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అరుణ్ కుమార్ భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పారిశుద్ధ్యం అధ్వానం



రైతుబజార్ వద్ద పేరుకుపోయిన చెత్త

నరసాపురం: పట్టణంలోని రైతుబజార్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. రోజూ వందలాది మంది రైతుబజార్‌కు వస్తుంటారు. అదీకాక ఈ రోడ్డుపై ఎక్కువ సంఖ్యలో జనం ప్రయాణిస్తుంటారు. ఈ ప్రాంతంలో ప్రతిరోజూ సరిగ్గా చెత్తకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. మున్సిపల్ శానిటేషన సిబ్బంది పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి పరిస్థితి చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్తమ ఉద్యోగులకు సత్కారం



పెనుగొండ ఎంపీడీవో కార్యాలయంలో ఉత్తమ అధికారులను సత్కరిస్తున్న దృశ్యం

పెనుగొండ: ప్రతిఒక్కరూ బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందించాలని పెనుగొండ ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి అన్నారు. మండల స్థాయిలో ఉత్తమ అవార్డులు అందుకున్న ఎంఈఓ–2 పి.రామకృష్ణ, హౌసింగ్ ఏఈ బి లక్ష్మణరావు, సీనియర్ అసిస్టెంట్ ఎ.వేణుగోపాలరావు, వడలి పంచాయతీ కార్యదర్శి కె శ్రీనివాసరెడ్డి, వల్లూరు హైస్కూల్‌కి రికార్డ్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందిన సాయి ప్రభువులను సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సూర్యప్రకాశరావు, ఆర్‌డబ్ల్యూఎస్ మిరియాల శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి పి.స్పందన తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రెయిన్‌లు



కనకదుర్గ గుడి రోడ్డులో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

నరసాపురం: పట్టణంలో పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు అధ్వానంగా తయారయ్యాయి. ఈ వేసవిలో పట్టణంలో డ్రెయిన్స్‌లో సిల్ట్‌తీత పనులు చేపట్టకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. గతంలో చేసిన పనుల నేపథ్యంలో డ్రెయిన్స్‌పై తీసిన మూతలు తిరిగి యథాస్థానంలో ఇప్పటికీ పెట్టలేదు. ఈ రకంగా కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి పరిస్థితి చక్కబెట్టాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు

భీమవరం: భీమవరంలో ఓ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో ఏడాది చదువుతున్న విద్యార్థి ఈ నెల 17 నుంచి కనిపించడంలేదని ఫిర్యాదు అందినట్లు సీఐ జి.కాళీచరణ్ తెలిపారు. శ్రీకాకుళానికి చెందిన యువకుడు భీమవరంలోనే ఓ గదిలో అద్దెకు ఉంటూ చదువుకుంటున్నాడు. సీసీ కెమేరా ఫుటేజీ పరిశీలించగా విద్యార్థి రైలు ఎక్కి విజయవాడవైపు వెళ్లినట్లు తెలియడంతో ఆ దిశగా పోలీసు బృందాలు గాలింపు ముమ్మరం చేశాయన్నారు.

వేంద్ర పాఠశాల విద్యార్థుల ప్రతిభ

పాలకోడేరు: బాలికా సంరక్షణపై నిర్వహించిన జిల్లా స్థాయి చిత్ర లేఖనం పోటీల్లో వేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వేంద్ర దీపిక ప్రథమస్థానం సాధించింది. అదేవిధంగా వారధి ఇండియా ఫౌండేషన్ వార్షిక వ్యాచరచన జిల్లా స్థాయి పోటీలలో సింగంశెట్టి యురేక, వనము కృతిక బృందం జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవీవీ శ్రీనివాస్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పాల వెంకట చలపతి, పాఠశాల విద్యాకమిటీ మెంబర్ కడలి వెంకట ఫణికుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

దసరా ఉత్సవాల సందడి షురూ

- రేపటి నుంచే దేవి శరన్నవరాత్రుల ప్రారంభం
- తుది మెరుగులు దిద్దుకుంటున్న అమ్మవార్ల విగ్రహాలు
- మండపాలు ఏర్పాట్లలో ఉత్సవ కమిటీల సభ్యులు



క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతి దేవి



నాగదేవత రూపంలో దుర్గాదేవి విగ్రహం



ఆకట్టుకుంటున్న విజయదుర్గాదేవి విగ్రహం



అమ్మకాలకు ముస్తాబైన అమ్మవార్ల విగ్రహాలు

పాలకొల్లు సెంట్రల్: హిందువులు ఆరాధ్యదేవతగా ఆరాధించే శ్రీ కనకదుర్గమ్మ వారి దేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శరన్నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని విగ్రహాల తయారీ దారులు అమ్మవార్ల విగ్రహాలను సిద్ధం చేశారు. రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభంకానుండడంతో ఉత్సవ కమిటీ సభ్యులు మండపాలను విద్యుద్దీపాలంకరణల ఏర్పాట్లను వేగవంతం చేశారు. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకూ నవరాత్రుల ఉత్సవాలు 11 రోజులు పాటు నిర్వహించనున్నారు. కొంతమంది నిర్వాహకులు నవరాత్రులు అనంతరం విజయదశమి నుంచి దశమి ఉత్సవాలను చేస్తుంటారు. మరికొంతమంది కమిటీ సభ్యులు నవరాత్రులు, దసరా ఉత్సవాలు కలిపి 18 రోజులు పాటు అమ్మవార్లకు పూజా కార్యక్రమాలు చేస్తుంటారు. ఆదివారం రాత్రికి కమిటీ సభ్యులు విద్యుద్దీపాలంకరణలు, పందిళ్లు, క్లాత్ డెకరేషన్ ఏర్పాట్లను పూర్తి చేసే విధంగా పనులను వేగవంతం చేస్తున్నారు.

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో

పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రులు సందర్భంగా ఆలయంలో పార్వతీ అమ్మవారికి నవావర్ణార్చన మరియు లక్ష కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం కలశస్థాపన, సాయంత్రం 6.15 గంటలకు అమ్మవార్ల అలంకరణలు ప్రారంభించనున్నారు. మొదటి రోజు సోమవారం బాలా త్రిపురసుందరి దేవి, మంగళవారం గాయత్రీదేవి, బుధవారం అన్నపూర్ణాదేవి, గురువారం విశాలాక్షిదేవి, శుక్రవారం శ్రీ లక్ష్మీదేవి, శనివారం లలితా త్రిపుర సుందరీదేవి, ఆదివారం మహాచండీదేవి, సోమవారం సరస్వతీదేవి, మంగళవారం దుర్గాదేవి, బుధవారం మహిషాసురమర్ధిని, గురువారం రాజరాజేశ్వరిదేవిగా 11 రోజులు అలంకరణలు ఏర్పాటు చేయనున్నారు. నవమి రోజు బుధవారం అమ్మవారికి కుంభం పోయడం, దశమి రోజు గురువారం శమీపూజతో ఉత్సవాలను ముగించనున్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో

స్థానిక యడ్లబజారు సెంటర్‌లో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో 11 రోజులు పాటు దాతల సహకారంతో అమ్మవారికి అలంకరణలు ఏర్పాట్లు చేయనున్నారు. బాలా త్రిపుర సుందరీదేవి, గిరిజాదేవి, చాముండేశ్వరి, రాజరాజేశ్వరి, గాయత్రీదేవి, అన్నపూర్ణేశ్వరి, ధనలక్ష్మి, సరస్వతీదేవి, కనకదుర్గమ్మ, మహిషాసురమర్ధిని, విజయదుర్గాదేవి అలంకరణలు చేయనున్నారు. బుధవారం నవమి రోజున వైఎస్సార్ సీపీ నాయకుడు గుణ్ణం నాగబాబు, రాజరాజేశ్వరి దంపతులతో అమ్మవారికి కుంభం పోయనున్నారు.

వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో....

పట్టణంలో వాసవి ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం వైశ్య ముత్తయిదువులతో పట్టణంలో 102 కలశాలతో వాసవి మాత ఊరేగింపు నిర్వహించనున్నారు. ఆదే రోజు సాయంత్రం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బాలా త్రిపుర సుందరీదేవి, మంగళవారం అన్నపూర్ణాదేవి, బుధవారం శ్రీశైల భ్రమరాభికాదేవి, గురువారం జోగులాంబదేవి, శుక్రవారం వైష్ణవి దేవి, శనివారం లలిత త్రిపురసుందరీదేవి, ఆదివారం ధనలక్ష్మీదేవి, సోమవారం సరస్వతిదేవి, మంగళవారం నవదుర్గ దేవి, బుధవారం మహాంకాళిదేవి, గురువారం శాంతాదేవి అలంకరణలు చేయనున్నారు.

250 విగ్రహాల తయారీ



ఈ సంవత్సరం సుమారు 250 అమ్మవార్ల విగ్రహాలు తయారు చేశాను. రెండు అడుగులు నుండి 10 అడుగుల వరకూ విగ్రహాలు తయారు చేశాను. చవితి ఉత్సవాలు అయిన వెంటనే అమ్మవార్ల విగ్రహాల తయారు మొదలు పెట్టాం. ఈ నెల రోజుల్లో 50 మంది వర్కర్లు రేయింబవళ్లు తయారు చేయగా నేటికి తుది మెరుగులు దిద్దుతున్నాము. ఒక్కో విగ్రహం ధర రూ.2 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంటుంది. ఆర్డర్ ప్రకారమే విగ్రహాలు తయారు చేస్తుంటాం.

– రాజు, విగ్రహాల తయారీదారుడు, పాలకొల్లు

గణపవరాన్ని పశ్చిమలోనే ఉంచాలి

పెనుమంట్ర: గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో నే ఉంచేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని శనివారం గణపవరం మండలానికి చెందిన అఖిలపక్ష నేతలు ఆచంట ఎమ్మెల్యే మాజీ మంత్రి పితాని సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు. గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లాలో కలపడం వల్ల 25 గ్రామాలకు చెందిన ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి రామకృష్ణంరాజు, ఏళ్ల సుబ్బారావు, రైతు సంఘం నాయకుడు కూచంపూడి జగపతి రాజు, మండల సర్పంచ్ చాంబర్ అధ్యక్షుడు ముత్యాల వేణు తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

పెనుగొండ: పెనుగొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి తెలిపారు. శనివారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉంది. అయితే ఎంపీటీసీ సభ్యులు పూర్తి స్థాయిలో సమావేశానికి హాజరు కాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు.

డీఎన్నార్ కళాశాలలో ప్రపంచ శాంతి దినోత్సవం



కళాశాలలో శాంతి ప్రతిజ్ఞ చేయిస్తున్న క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ప్రపంచ శాంతి కావాలంటే ప్రతీ పౌరుడు సంయమనం పాటించాలని ప్రతీ విషయాన్ని కూలంకషంగా ఆలోచిస్తే శాంతి మార్గం కనిపిస్తుందని లయన్స్ క్లబ్ అధ్యక్షులు శిడగం సతీష్ అన్నారు. శనివారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ శాంతి దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచంలో యుద్ధవాతావరణం నెలకొందని అన్నారు. దీనివల్ల ప్రాణనష్టం, ఆర్థిక నష్టం, ఆహార ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. ప్రస్తుత పరిస్థితులు ఇలా ఉంటే భవిష్యత్‌తరాల వారికి శాంతి సమాజం అందివ్వలేమని అన్నారు. విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు సమాజాభివృద్ధికి కృషి చేయాలని తద్వారా శాంతి ప్రపంచాన్ని సమకూర్చుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో 26 పాఠశాలల్లో అలాగే లయన్స్ ఆసుపత్రిలో మొత్తం 27 ప్రాంతాల్లో శాంతి ప్రతిజ్ఞ చేయించామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర శోభారాణి, క్లబ్ సెక్రటరీ దోనెల ప్రసాద్, ట్రెజరర్ దేవరపు ప్రసాద్, శిడగం ఈశ్వర్, శిఖాకొల్లు మైథిలి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



పెనుగొండలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ శ్యామలాసోనీ శాస్త్రి



పాలకొల్లు సెంట్రల్: వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యాధికారులు

పెనుగొండ: మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామల సోనీ శాస్త్రి అన్నారు. శనివారం పెనుగొండ గ్రామ పంచాయతీ వద్ద స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మహిళ ఆరోగ్యం ప్రతి ఇంటికీ మంచిదని మహిళల్లో ఉన్న అనారోగ్య సమస్యలు పరీక్షించుకుని ఆరోగ్యంపై అవగాహన తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సిద్ధాంతం సర్పంచ్ గనిరాజు, దొంగరావిపాలెం సర్పంచ్‌కోన రామలింగేశ్వరరావు, చిన్నమల్లం సర్పంచ్ చిట్టూరి సుబ్రహ్మణ్యం, రామన్నపాలెం ఎంపీటీసీ సభ్యుడు కృష్ణ కాంత్ పాల్గొన్నారు.

పెనుమంచిలిలో

ఆచంట మండలం పెనుమంచిలిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ శిబిరాన్ని సర్పంచ్ గణేషుల శేషవేణి సుబ్బారావు ప్రారంభించారు.

బల్లిపాడులో

పాలకొల్లు సెంట్రల్: మహిళలు ఆరోగ్యకరంగా ఉంటే ఆ కుటుంబం శక్తివంతంగా ఉంటుందని సర్పంచ్ భూపతిరాజు ఇందిరాదేవి అన్నారు. శనివారం మండలంలోని బల్లిపాడు గ్రామంలో ఆరోగ్యవంతమైన మహిళ–శక్తివంతమైన కుటుంబం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ఇందిరాదేవి మాట్లాడుతూ ప్రతిమహిళా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రభుత్వం నిర్వహించే ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో 108 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ నవ్య జీవన్, బి.గోపాలరాజు, పాలమూరు సర్పంచ్ పంచదార వెంకట లక్ష్మీనారాయణ, దండు నరసింహరాజు, సెక్రటరీ గౌరీ భవానీ, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



పాలకొల్లు సెంట్రల్: మొక్కలు నాటుతున్న జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి



పెనుగొండ: శేషమ్మచెరువులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ

పాలకొల్లు సెంట్రల్: మన పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచుకుంటే ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. శనివారం పట్టణంలోని ఆదిత్య కాలనీ వద్ద మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయడానికి ప్రభుత్వం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. దీనిలో భాగంగా ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ దాశి రాజు, మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి, తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈ నెల 24న మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె వివాహానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్న నేపథ్యంలో బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేయనున్న హెలిపాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు.

తడి–పొడి చెత్తలపై అవగాహన పెంచుకోవాలి

పెనుగొండ: తడి,పొడి చెత్తలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఆచంట ఎంపీడీఓ బి.కృష్ణమోహన్ అన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆచంట, శేషమ్మ చెరువుల్లో తడి చెత్త–పొడి చెత్తలపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరిగి వాటిని వేరు చేయడం, ప్లాస్టిక్ నిర్వహణలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పిచ్చయ్య, సర్పంచ్ జక్కంశెట్టి శ్రీరాములు, ఈఓపీఆర్డీ సూరన్న, కార్యదర్శులు జానకి, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆచంటలో పారిశుద్ధ్య పర్యవేక్షణ

ఆచంటలో తహసీల్దారు జి.కనకరాజు పారిశుద్ధ్య పర్యవేక్షణ చేశారు. స్వయంగా చీపురుపట్టి కార్మికులతో కలిసి పారిశుద్ధ్య నిర్వహణ చేశారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ పాటు పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం

కల్వర్టులపై రక్షణ చర్యలు నిల్



చెరుకువాడలో మార్జిన్‌లేకుండా ప్రమాదంగా ఉన్న రహదారి

పెనుగొండ: కల్వర్టుల వద్ద గోడలు లేక, ప్రధాన రహదారుల్లో మార్జిన్లు లేక ప్రమాదపుటంచున ప్రయాణం చేయాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా పెనుగొండ, వడలి, రామన్నపాలెం సిద్ధాంతం రహదారుల్లో పంటకాలువలకు కల్వర్టు గోడలు లేకపోవడం, ప్రధాన రహదరికి మార్జిన్ లేకపోవడంతో వాహనదారులు నానా ఇక్కట్లకు గురవుతున్నారు. పెనుగొండ ఎస్‌వీకేపీ కళాశాలల కూడలి వద్ద డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద, ఆచంట ఓల్డ్ చానల్‌కు కల్వర్టు గోడ లేకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. రాత్రి వేళల్లో రహదారి మార్జిన్ ఇంకా ఉందనుకొని పక్కకు వస్తూ కల్వర్టు వద్ద ఉన్న గోతిలో పడి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. ఇదే పరిస్థితి చెరుకువాడలో ప్రధాన రహదారి వద్ద నెలకొంది. ప్రధాన రహదారి విస్తరణలో కనీస మార్జిన్ లేకుండా సిమెంట్ రహదారి నిర్మించారు. అదీ రోడ్డు మలుపులో కనీస మార్జిన్ లేకపోవడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చేటపుడు మోటార్ సైక్లిస్టులు అదుపు తప్పి మురుగు బోదేలో బోల్తా పడుతున్నారు.

గ్రామాల్లో ఇలా

మండలంలోని ఘటాల దిబ్బ వద్ద కల్వర్టుకు గోడ నిర్మించుకుండా వదలేశారు. ఇక్కడా ఇదే పరిస్థితి ఉంది. సిద్ధాంతం పంచాయతీ వద్ద గరగాలమ్మ డ్రయిన్ నుంచి వచ్చే మురుగుకాలవ ప్రధాన రహదారి కిం నుంచి వెళుతుంది. ఈ ప్రాంతంలో కల్వర్టు గోడలు లేకుండా ఉండడంతో ముఖ్యంగా వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారు. మోటారు సైక్లిస్టులు జారీపడుతున్నారు. ఆయా ప్రాంతాల వాసులు కల్వర్టు నిర్మాణాలకు, మార్జిన్ల పొడిగింపు ఎన్నో సార్లు విజ్ఞప్తిలు చేసినా ఫలితం లేకుండా పోయింది. రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌తో ఏ మాత్రం ఇబ్బందులు ఎదురైనా పెనుప్రమాదం సంభవించే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కల్వర్టు గోడల నిర్మాణం, మార్జిన్‌లు పెంచడం చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



సిద్ధాంతం పంచాయతీ వద్ద ప్రమాదంగా కల్వర్టు



పెనుగొండ ఎస్‌వీకేపీ కూడలి వద్ద గోడలేకుండా ఉన్న కల్వర్టు

సనాతన ధర్మ పరిరక్షణే ప్రపంచ శాంతి



ఆలయంలో మాట్లాడుతున్న యోగి శ్రీసంత్ సదానంద గిరి స్వామి మహరాజ్

భీమవరం (ప్రకాశంచౌక్): సనాతన ధర్మ పరిరక్షణే ప్రపంచ శాంతి అని శతాధిక వృద్ధులు హిమాలయ యోగి శ్రీసంత్ సదానంద గిరి స్వామి మహరాజ్ (109) అన్నారు. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామివారిని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మహారాజ్ స్వామి మాట్లాడుతూ గౌతమి బుద్ధుని కాలంలో కులాలు, మతాలు లేవన్నారు. నేడు మానవులు కులమతాలు జాతులతో కొట్లాడుకుంటున్నారని, భగవంతుడిని ధిక్కరించే పరిస్థితి నేటి కాలంలో ఏర్పడిందన్నారు. మానవులు అందరూ ఆధ్యాత్మిక చైతన్యంతో మెలగాలని సూచించారు. అనంతరం ఆలయ మర్యాదలతో వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఉద్దరాజు ఫౌండేషన్ నుంచి ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, కుక్కల బాల, చెరుకువాడ రంగసాయి, సరిపిడకల రామారావు, జానపాటి మధు, పిప్పళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలను తరచూ చెక్ చేసుకోవాలి

యలమంచిలి: ఖాతాదారులు తమ బ్యాంకు ఖాతాలను తరచూ చెక్ చేసుకోవాలని విజిలెన్స్ ఆఫీసర్ రాంబాబు కోరారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా మేడపాడు గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో శనివారం ఖాతాదారులతో సదస్సు నిర్వహించారు. ఖాతాదారులు డబ్బులు వేసిన సమయంలోనూ, తీసిన సమయంలోనూ తప్పనిసరిగా స్టేట్‌మెంట్ రికార్డు చేయించుకోవాలన్నారు. బ్యాంకు ఎప్పుడూ ఓటీపీలు ఫోన్‌లో అడగదన్నారు. కాబట్టి ఫోన్‌లో ఏటీఎం పిన్‌లు, ఖాతా వివరాలకు చెందిన ఓటీపీలు చెప్పవద్దని కోరారు. బ్యాంకు నుంచి వచ్చే మెసేజీలను కూడా నిశితంగా పరిశీలించాలన్నారు. డిజిటల్ లావాదేవీలలో మీ ప్రమేయం లేకుండా నగదు లావాదేవీలు జరిగితే వెంటనే ఏటీఎం కార్డులను బ్లాక్ చేసి బ్యాంకుకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజరు హైమవతి పాల్గొన్నారు.

గుండెపోటుతో వైద్యుడి మృతి



అంజన్ (55)

పాలకొల్లు సెంట్రల్: ప్రముఖ వైద్యుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి (డా. బాబ్జి) కుమారుడు డాక్టర్ అంజన్ (అంజిబాబు 55) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఈయనకు భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. శనివారం అంజన్‌కు గుండెల్లో నొప్పిగా ఉందనడంతో హుటాహుటిన పట్టణంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

గుండెపోటుతో ఏఎంసీ డైరెక్టర్ మృతి

పెనుగొండ: పెనుగొండ ఏఎంసీ డైరెక్టర్ దాసరి శ్రీను(55) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. అయనకు భార్య, ఇద్దరు సంతానం. ఇటీవలే డైరెక్టరుగా బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టరు మృతికి పెనుగొండ ఏఎంసీ చైర్మన్ బడేటి వీర బ్రహ్మ(బ్రహ్మజీ), ఇతర డైరెక్టర్లు సంతాపం వ్యక్తం చేశారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులు

పాలకోడేరు: మండల స్థాయిలో 2025–26 సంవత్సర గ్రామ పంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఈనెల 25, 26 తేదీల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. మండల పరిషత్ అధ్యక్షులు, మండలంలోని గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు శిక్షణ తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

ఎన్ఎస్ఎస్ దినోత్సవం

భీమవరం: ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ ద్వారా విద్యార్థులు ఉద్యోగావకాశాలు పొందే అవకాశముందని భీమవరం కేజీఆర్ఎల్ కళాశాల కార్యదర్శి మెంటే రామ్‌మనోహర్ అన్నారు. శనివారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం ప్రారంభించి మాట్లాడారు. నిర్దిష్టమైన జీవన ప్రమాణాలుండాలంటే ప్రతి విద్యార్థి ఎన్ఎస్ఎస్, ఎన్సీసీల్లో చేరాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో ర్యాలీ నిర్వహించి 200 మొక్కలను నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇంటి రామచంద్రమూర్తి, పీజీ డైరెక్టర్ తోట రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.